క్లుప్తంగా

శాకంబరిగా కన్నమాంబ తల్లి


శాకంబరి అలంకరణలో అమ్మవారు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రధాన రైల్వే స్టేషన్ ఆవరణలో కొలువైన కన్నమాంబ తల్లి మంగళవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా భక్తుల సహకారంలో వివిధ కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ పూజారి ఏడాకుల వరలక్ష్మి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కన్నమాంబ తల్లిని దర్శించుకున్నారు.

వైభవంగా కన్నమ్మతల్లి జాతర


ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట రెడ్డీలపేటలో కొలువైన కన్నమ్మతల్లి జాతర మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, వేషధారణలు, బాణసంచా కాల్పులతో చల్లఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. కన్నమ్మతల్లి అమ్మవారికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ముంపులోనే ఆ రెండు గ్రామాలు

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి వరద ఉధృతి కారణంగా ముంపు బారిన పడిన బొమ్మూరు, హుకుంపేట గ్రామాలలో అదే పరిస్థితి కొనసాగుతోంది. బొమ్మూరు నేతాజీ నగర్, హుకుంపేట రామకృష్ణ నగర్, సావిత్రి నగర్ ప్రాంతాల ప్రజలు ముంపునీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఓఎన్‌జీసీ సహకారంతో ధవళేశ్వరం వద్ద ముంపు నీటిని తోడడంతో కొద్దిగా నీరు లాగుతోంది. కాగా.. మంగళవారం హుకుంపేటలో వరద బాధితులకు బియ్యం, నిత్యావసరాల కిట్లను టీడీపీ వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ పంపిణీ చేశారు. అలాగే ధవళేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.

క్లాత్ సంచులతో పర్యావరణానికి మేలు


క్లాత్‌బ్యాగ్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కంబాలచెరువు: క్లాత్ సంచుల వాడకంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని, ప్లాస్టిక్ బ్యాగ్‌ల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని స్థానిక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల (ఆర్ట్స్ కళాశాల) జాతీయ సేవా పథకం విద్యార్థులు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగం అరికట్టాలని, క్లాత్ బ్యాగ్‌ల వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్లాత్, జనపనార బ్యాగ్‌లు వాడడం వలన పర్యావరణాన్ని సంరక్షించవచ్చన్నారు. జాతీయ సేవా పథకం విభాగ సమన్వయకర్త డాక్టర్ బి.మల్లికార్జున్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.భవానీదేవి, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు

కంబాలచెరువు: క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం ఆయన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు కూడా బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ధవళేశ్వరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువే ఆధారమన్నారు. తొలుత కళాశాలలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మరో పది తరగతి గదులు నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కూర ఘాటు.. తప్పని పాట్లు


విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు


రాజమహేంద్రవరంలో టెర్రస్ గార్డెన్‌లో ఆనప పాదు

- పెరిగిన కూరగాయల ధరలు
- దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి
- ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిపోయిన పంటలు

రాజమహేంద్రవరం రూరల్: విపరీతంగా పెరిగిన కూరగాయల ధరలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సామాన్యుడు వాటికి కొనడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. కేజీ కూరగాయలు కొనడానికి వెళ్లినవారు...ధరలను చూసి భయపడి అర కేజీ మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మనిషి ఎంత కష్టపడినా జానెడు పొట్టకోసమే. కడుపు నిండా తిని, హాయిగా నిద్రపోయే పరిస్థితి క్రమంగా దూరమవుతోంది. నచ్చిన కూరతో సంతోషంగా భోజనం చేయడానికి బదులు.. ఏ కూరగాయాల ధర తక్కువో తెలుసుకుని, వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా కూరగాయాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, అలాంటి వాటనే తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అది నిజమే అయినప్పటికీ పెరిగిన ధరలు ప్రజలకు భయపెడుతున్నాయి.

రెండు నెలలుగా..

పెరిగిన కూరగాయల ధరలలో దాదాపు రెండు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడైనా అందుబాటులోకి వస్తాయనుకుంటే అధిక వర్షాలను పంటలను ముంచేశాయి. ముఖ్యంగా కూరగాయల పంటలను నాశనం చేశాయి. దీంతో ధరల దందా కొనసాగుతూనే ఉంది. మార్కెట్లో పచ్చిమిర్చి ధర ఆకాశాన్నంటింది. బంగాళదుంప, దొండకాయ, బీర, అల్లం ఇలా అన్నీ భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలు, గోదావరి వరద ప్రవాహం కారణంగా లంక గ్రామాలు, ఇతర ప్రాంతాలలో కూరగాయల పంట మునిగిపోయింది.

ధర తగ్గిన టమాటా

వేసవిలో టమాటా సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణ లేకపోవడంతో రైతులు ఆసక్తి చూపలేదు. దీంతో మదనపల్లి, బెంగళూరు, అనంతపల్లి, కర్నూలు నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. మొన్నటి వరకు కిలో రూ.50 ఉన్న టమాటా ఇప్పుడు రూ.38 పలుకుతోంది. ఇప్పుడు వర్షాల కారణంగా మళ్లీ ధర పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. స్థానికంగా పండించే పంట మార్కెట్‌లోకి రావడానికి మరో నెల ఆగాల్సిందే.

ఉల్లిపాయలు

ఉల్లి ధర పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పండిస్తారు. కానీ అక్కడ కూడా ప్రస్తుతం తగ్గిపోయింది. ఖరీఫ్‌లో ఇప్పుడిప్పుడే సాగు మొదలైనట్లు సమాచారం. దీంతో మహారాష్ట్ర నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.36 నుంచి రూ.40 వరకూ విక్రయిస్తున్నారు. బయట ఇంకా ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు.

టెర్రస్ గార్డెన్స్‌పై దృష్టి

రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో టెర్రస్ గార్డెన్స్ కల్చర్ పెరిగింది. మహిళలు తమ ఇంటిలోని పైభాగంలో సేంద్రియ ఎరువులతో కూరగాయలను పండిస్తున్నారు. ఇంటిపై పెంచే కూరగాయల సాగునే టెర్రస్ టెర్రస్ గార్డెన్స్ అంటారు. ఇలా పండించిన కూరగాయాలను తమ ఇంటిలో ఉపయోగించుకోవడంతో పాటు స్నేహితులకు, బంధువులకు అందజేస్తున్నారు. అలాగే పెరుగుతున్న కూరగాయల ధరల నేపథ్యంలో మహిళలు సొంతంగా పండించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ధరల వివరాలు (కేజీ రూపాయలలో)

కూరగాయ	హోల్‌సేల్	లోకల్ మార్కెట్	రైతుబజార్
టమాటా	26	32	28
వంకాయలు (నలుపు)	46	54	48
వంకాయలు (తెలుపు)	46	54	48
వంకాయలు (గులాబి)	56	64	58
వంకాయలు (దొమ్మేరు)	62	70	64
బెండకాయలు	14	20	16
పచ్చిమిర్చి సన్నాలు	50	58	52
కాకరకాయలు	40	48	42
బీరకాయలు పందిరి గ్రేడ్-1	36	42	38
దొండకాయలు	32	38	34
బంగాళాదుంపలు	38	45	40
ఉల్లిపాయలు	34	40	36
చిక్కుడుకాయలు	78	86	80
చేమదుంపలు	40	48	42
బీన్స్‌కాయలు	70	78	72
బీన్స్‌గింజలు	123	136	126
అల్లం పాతది	140	154	144
చిలకడదుంప ఎరుపు	46	54	48

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి


నగరంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, తమకు కేటాయించిన పరిధిలో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. ఆయన మంగళవారం నగరంలోని ప్రధాన కూడళ్లలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి రాబోయే రోజులలో పారిశుధ్య నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నగరంలోని మొత్తం చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు. అలాగే ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తరలించాలన్నారు సంబంధిత ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి, ఆ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు, రోడ్లపై తినుబండారాలు, పండ్లు, ఇతర వస్తువులను విక్రయించే వారందరూ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం కోటిలింగాల పేటలో నగరపాలక సంస్థ అందిస్తున్న తాగునీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.వి నూత్న ఉన్నారు.

హైవేపై పూర్తిస్థాయిలో పనులు


పనుల అనంతరం పరిశుభ్రంగా కన్పిస్తున్న జాతీయ రహదారి


రోడ్డు అంచున పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది


కడియపులంకలో స్పష్టంగా కనిపిస్తున్న రోడ్డు

కడియం: జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచిపోవడం, ఒక పక్క మాత్రమే జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంపై సోమవారం సాక్షిలో 'పేరుకే జాతీయ రహదారి' శీర్షికన వచ్చిన వార్తకు సంబంధిత హైవే సిబ్బంది స్పందించారు. మంగళవారం కడియం మండలం పరిధిలోని వేమగిరి నుంచి పొట్టిలంక వరకు రోడ్డుకు ఎడమ పక్కన కూడా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. అలాగే పిచ్చిమొక్కలను తొలగించారు. కడియపులంక పంచాయతీ పరిధిలో పనులు కొనసాగుతున్నాయి. వేమగిరి వరకూ కూడా క్లియరెన్స్ పనులు జరుగుతాయని సంబంధిత సిబ్బంది తెలిపారు. అలాగే రోడ్డుపై నిలిచిపోతున్న వర్షపు నీటిని కూడా పక్కకు మళ్లించారు.

గోదావరి ఏటిగట్టును పటిష్టం చేయాలి

ప్రకాశం నగర్: గోదావరి ఏటిగట్టును పటిష్టం చేయాలని, నగర వాసుల తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ సీపీఎం నాయకులు మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఎగువ నుంచి కలుస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోందన్నారు. ధవళేశ్వరం నుంచి పురుషోత్తపట్నం మధ్యలో ఉన్న కాతేరు, తొర్రేడు, బొబ్బిల్లంక, మునికూడలి, ముగ్గళ్ల, సీతానగరం ప్రాంతాల్లో ఏటిగట్టుకు ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు గతంలోనే నివేదికలు ఇచ్చారని చెప్పారు. తక్షణమే అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసి ఏటిగట్లను పటిష్టం చేయాలని కోరారు. ఆర్యాపురం నల్లా ఛానల్ వద్ద వరద నీరు నగరం లోపలకు ప్రవేశిస్తోందన్నారు. ఆ సమయంలో డ్రైనేజీ నీరు బయటకు (గోదావరిలోకి) వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే ఆర్యాపురం, తుమ్మలోవ, ఆదెమ్మదిబ్బ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. నగర ప్రజలు వర్షాకాలంలో తాగునీటికి అల్లాడిపోతున్నారని, గోదావరిలో నీటిని సేకరించే ఇన్ టేక్ పాయింట్ వద్ద బురద, చెత్త పేరుకుపోవడంతో నీటి సేకరణకు ఆటంకాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆయనతో నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు ఉన్నారు.

దొరగారి కాలనీలో డ్రైనేజీ సమస్య


దొరగారి కాలనీలోని వీధిలో నిలిచిన వాడకం నీరు


వీధుల్లోకి చేరుతున్న మురుగునీరు

కడియం: మురమండ పంచాయతీ పరిధిలోని దొరగారి కాలనీ వాసులకు మురుగు కాలువ సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ కాలనీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లకు పైగా అవుతోంది. సుమారు 50 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నాయి. వీరందరూ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే ఇళ్ల నుంచి వచ్చే వాడకం నీరు బయటకు పోయే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చే ప్రతి నాయకుడికి తమ సమస్యను విన్నవించి, పరిష్కరించాలని కోరుతున్నారు. కానీ ఇప్పటి వరకూ ఆ సమస్యకు మోక్షం కలగలేదు. రోడ్డు పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలోకి తాత్కాలికంగా మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్నప్పటికీ స్థానిక రైతుల అభ్యంతరాల నేపథ్యంలో అది కూడా ఫలితం ఇవ్వడం లేదు. దీంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలోని వీధుల్లోకి నీరంతా చేరిపోయింది. సీజనల్ వ్యాధుల సమయం కావడంతో కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


ర్యాలీలో పాల్గొన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తదితరులు

కంబాలచెరువు: ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నియమాలు పాటించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ గంధం సునీత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు కార్యాలయం నుంచి లాలా చెరువు వరకు ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా రవాణాశాఖ అధికారి కేవీ కృష్ణారావు మాట్లాడుతూ రోడ్ల ప్రమాదాల్లో చాలామంది వాహనచోదకులు హెల్మెట్ లేని కారణంగా మృత్యువాత పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.నరసింహులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

ఏపీని ఆదుకునేలా కేంద్ర బడ్జెట్

రాజమహేంద్రవరం సిటీ: మన రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకునేలా కేంద్ర బడ్జెట్ రూపొందించారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లను కేంద్రం ప్రకటించడం హర్షణీయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన అవినీతి, అక్రమాలు, అన్యాయాలకు చిరునామాగా నిలిచిందని ఆరోపించారు.

ప్రభుత్వం దృష్టికి 'ఆటోఫైనాన్స్' సమస్యలు


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం: ఆటో ఫైనాన్స్ వ్యాపారుల సమస్యలపై ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినట్టు రాజమహేంద్రవరం అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12,500 ఫైనాన్స్ కంపెనీలు ఉండగా, రాజమహేంద్రవరంలోనే 42 ఉన్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆటో ఫైనాన్షియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి అధ్యక్షుడిగా రాజహేంద్రవరానికి చెందిన నాగరాజా ఫైనాన్స్ అధినేత వల్లెపు మంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఆటో ఫైనాన్షియర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి రాష్ట్ర అసోసియేషన్ తీసుకువెళ్లిందన్నారు. వల్లెపు మంగరాజు మాట్లాడుతూ ద్విచక్ర, మూడు చక్రాల వాహనాలను తాకట్టు పెట్టడం వల్ల తమ వ్యాపారానికి ఇబ్బంది ఎదురవుతోందని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. సమావేశంలో అసోషియేషన్ నగర అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ సప్పా ఆదినారాయణ సెక్రటరీ ఎంవీ రామరాజు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో యువకుడి అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యువతి ఆత్మహత్యకు కారకుడైన యువకుడిని రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఎస్పీ నరసింహ కిషోర్ విడుదల మంగళవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తూ, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఓ దళిత యువతి (29), సీతానగరం మండలం వంగలపూడికి చెందిన షేక్ నాగూర్‌బాబు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలియడంతో అబ్బాయి తండ్రితో మాట్లాడారు. ఏడాది తరువాత వివాహం చేస్తామని వారు తెలిపారు. ఈలోగా నాగూర్‌బాబు ఆ యువతిని మభ్యపెట్టి, ఆమె పేరిట లోన్లు పెట్టించి, రూ.11.97 లక్షలు తన అవసరాలకు వాడుకున్నాడు. అనంతరం ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతో అనుమానించి వేధించేవాడు. ఆమెను పరుష పదజాలంతో తిట్టేవాడు. కులం పేరుతో దూషించేవాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి, మనస్తాపానికి గురైన ఆ యువతి గత జూన్ 29వ తేదీ అర్ధరాత్రి క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టిచ్చిన సెల్ ఫోన్


మృతి చెందిన యువతి సెల్ ఫోన్‌ను తనకు ఇవ్వాలంటూ ఆమె కుటుంబ సభ్యులను నాగూర్ బాబు ఒత్తిడి చేస్తూండటంతో వారికి అనుమానం వచ్చింది. యువతి ఫోను పరిశీలించగా ఆమెను నాగూర్‌బాబు వేధించిన వాయిస్‌లు, ఇతర అంశాలు బయటపడ్డాయి. ఆమె బ్యాగులో సూసైడ్ నోట్ లభించడంతో ఆ ఆధారాలను పోలీసులకు అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఈ కేసు దర్యాప్తు చేశారు. దళిత యువతి ఆత్మహత్య ఘటనలో నాగూర్ బాబు పాత్రకు సంబంధించిన ఆధారాలు సేకరించి, అతడిని అరెస్టు చేసి కోర్టులు హాజరుపరిచి, రిమాండుకు తరలించారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడినా, అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎదిగిన పిల్లల ప్రవర్తనలో మార్పులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని, మంచి నడవడిక నేర్పించాలని సూచించారు.


85 నంబర్ జీవోపై పునరాలోచన చేయాలి


డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశాలకు సంబంధించిన ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన 85 నంబర్ జీవోపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బొమ్మూరులోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీలకు ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, ఇతర వైద్యాధికారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ 85 నంబర్ జీవోను వెనక్కి తీసుకోని, ఇన్ సర్వీస్ కోటాను మునుపటి లాగానే ఉంచాలన్నారు. ఇది సాధించే వరకూ తాము పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

శాంతించిన గోదావరి


నిలకడగా గోదావరి ప్రవాహం


హారతి ఇస్తున్న పండితులు


గోదావరికి వరద ఉధృతి తగ్గడంతో పుష్కరాలరేవులో కనిపిస్తున్న మెట్లు

రాజమహేంద్రవరం సిటీ: వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తూ భయపెట్టిన గోదావరి శాంతించింది. ఎగువ నుంచి నీటి ప్రవాహం తగ్గడంతో పాటు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి మిగులు జలాలను ఎప్పటికప్పుడు విడుదల చేయడంతో నీటి ఉధృతి తగ్గింది. దీంతో మంగళవారం సాయంత్రం పుష్కరఘాట్‌లో మెట్ల కిందకు నీరు దిగింది. కాగా.. పుష్కరఘాట్‌లో మంగళవారం సాయంత్రం పండితులు గోదారమ్మకు హారతి ఇచ్చారు.

15న అన్న క్యాంటీన్ల ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఆగస్టు 15వ తేదీన మూడు అన్న క్యాంటీన్లను పునః ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని వద్దగల అన్న క్యాంటీన్‌ను కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ కార్యక్రమాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. అన్న క్యాంటీన్లలో రూ.15కే నాణ్యమైన భోజనం అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, క్వారీ మార్కెట్, కార్పొరేషన్ కార్యాలయం పక్కన వీటిని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.